
ఆంధ్రజ్యోతి



5 వరంగల్

శనివారం 23 మార్చి 2024

శుక్రవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 34.0°C | కనిష్ఠం : 22.0°C




రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శనివారం సా : 6.34 గం..

సహర్ : ఆదివారం ఉ : 4.55 గం..



అక్రమాలకు కేరాఫ్ కేయూ!



ఆరోపణలు, వివాదాలకు కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ

- గాడి తప్పిన పాలనతో అంతా అస్తవ్యస్తం
- అనుబంధ అధ్యాపకుల నియామకం, ఆన్సర్‌షీట్ల స్కానింగ్ టెండర్లలో గోల్‌మాల్
- ఫార్మసీ కళాశాలలకు అనుమతుల్లోనూ నిబంధనలకు చెల్లుచీటీ
- పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలపై విద్యార్థుల ఆందోళన
- సీడ్‌మనీ పేరుతో ఫేక్ ప్రాజెక్టులతో నిధులు స్వాహా
- రిజిస్ట్రార్‌తో సహా అనేక నియామకాలపై వివాదం

"ఎంతో ఘన చరిత్ర కలిగిన కాకతీయ యూనివర్సిటీ అక్రమాలు, వివాదాలకు కేరాఫ్‌గా మారిందా? యూనివర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు, నిధుల కేటాయింపులు జరుగుతున్నాయా? అడ్మిషన్లు మొదలు విద్యార్థుల ఆన్సర్ షీట్ల స్కానింగ్ టెండర్ల రద్దు వరకు అన్నీ అక్రమార్కుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయా? వీసీ, రిజిస్ట్రార్ నియామకంతో పాటు 16మంది అనుబంధ అధ్యాపకుల కొలువుల దాకా అన్నిటిలోనూ ఆరోపణలకు కేంద్రంగా విశ్వవిద్యాలయం మారిందా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానమే వినిపిస్తోంది. యూనివర్సిటీలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం దృష్టిసారించకపోవటంతో విద్యా ప్రమాణాలతో పాటు వర్సిటీ కీర్తిప్రతిష్ఠలు కూడా దెబ్బతింటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి."

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

7

బాలికపై అత్యాచార యత్నం

- భూపాలపల్లి సైబర్ క్రైం సీఐ సంపత్ అరెస్టు
- పోక్సో కేసులో రిమాండ్‌కు తరలింపు



సంపత్

వరంగల్ క్రైం, మార్చి22: బాలికపై అత్యాచార యత్నం చేసిన కేసులో భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం విభాగంలో సీఐగా పనిచేస్తున్న బండారు సంపత్ అరెస్టయ్యారు. ఈయనపై పోక్సో కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు.. గురువారం అర్ధరాత్రి అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..

2012 బ్యాచ్‌కు చెందిన బండారు సంపత్.. వరంగల్ కమిషనరేట్ పరిధిలో వర్ధన్నపేట, జఫర్‌గడ్, కేయూ తదితర పోలీసుస్టేషన్‌లలో ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. కేయూ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా (ఆగస్టు 2021 నుంచి డిసెంబర్ 2022) పనిచేసిన సమయంలో సంపత్‌కు ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. సదరు మహిళ కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక కాలనీలో నివాసం ఉంటోంది. సంపత్ పరిచయంతో మహిళ కాపురంలో గొడవలు జరిగి భర్తకు దూరమైంది. ఆ తర్వాత ఇద్దరు సహజీవనం చేశారు. మొదటి భార్య వరంగల్ దేశాయిపేటలో ఉండగా.. ఈ మహిళ వద్దకు సంపత్ వస్తూ ఉండేవాడు.

దీంతో సదరు మహిళ భర్త నాటి సీపీ రంగనాథ్‌కు సంపత్‌పై ఫిర్యాదు చేయగా విచారణ చేసి వీఆర్‌కు అటాచ్ చేశారు. ఆపై సీఐగా పదోన్నతి పొందిన సంపత్.. ఖమ్మం, అటు నుంచి భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైంకు మారారు. కాగా, మహిళ వద్దకు వస్తున్న సీఐ సంపత్.. ఆమె కూతురు (మైనర్)పై కన్నేశాడు. ఇటీవల ఆ బాలికపై అత్యాచార యత్నం చేశాడు. గమనించిన సదరు మహిళ.. సీఐ సంపత్‌పై ఇటీవల కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

విచారణ చేసిన కేయూ పోలీసులు.. అత్యాచార యత్నం, పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. సీఐ సంపత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన విషయాన్ని కేయూ సీఐ సంజీవ్ ధ్రువీకరించారు. అరెస్టయిన సీఐ సంపత్‌పై సస్పెన్షన్ వేటు పడనుంది.

కడియం మాదిగ ద్రోహి

- రాజయ్యకు, పసునూరికి టికెట్ రాకపోవడానికి ఆయనే కారణం
- అరూరి రమేష్ ఓటమిలోనూ పాత్ర
- శ్రీహరికి గుణపాఠం చెప్పడానికే బీఆర్ఎస్‌కు ఓటెయ్యొద్దు..
- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మద్దతు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంద క్రిష్ణమాదిగ

హనుమకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాదిగద్రోహి అని, రాజకీయాల్లో మాదిగలు ఎదగకుండా ఆయన అడుగడుగునా అడ్డుపడుతున్నాడని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ విమర్శించారు. శుక్రవారం వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కడియం శ్రీహరిపై ధ్వజమెత్తారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ నేపథ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన వారు ఎదగకు ండా కుట్రలు చేస్తున్న శ్రీహరి.. పక్కా స్వార్థపరుడి గా అభివర్ణించారు. ఇందుకు మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య ఉదంతమే ఉదాహరణన్నారు. తన ఎదుగుదల కోసం రాజయ్య ను బలిపశువును చేశాడన్నారు. పార్టీ అధిష్ఠానానికి లేనిపోనివి చెప్పడం ద్వారా రాజయ్యను ఆ పదవి నుంచి తొలగించేట్టు చేసి ఉపముఖ్యమంత్రి పీఠంపై తాను కూర్చున్నాడని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ నుంచి ఎదిగిన మరో నేత అరూరి రమేష్ విషయం లోనూ ఇదే కుట్రను అనుసరించాడని, వర్ధన్నపేటలో అరూరి గెలిస్తే తనకు మంత్రి పదవి రాదని కుట్ర పన్నాడన్నారు. సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ విషయంలోనూ కడియం ఇదే కుట్ర ధోరణిని అనుసరించాడని, తన కూతురు కోసం పసునూరికి లోక్‌సభ టికెట్ రాకుండా మోకాలడ్డాడని ఆరోపించారు. గత లోక్‌సభఎన్నికల్లో మాదిగేతరుడైన గుడిమల్ల రవికుమార్‌కు టికెట్ ఇప్పించేందుకు కడియం ప్రయత్నించాడని, ఆయన మాదిగ వ్యక్తి కాదన్న వాస్తవాన్ని తాము పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకురావడంతో చివరి నిమిషంలో దయాకర్‌కు టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో దయాకర్ భారీ మెజారిటీతో గెలిచాడని గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేయకుండా శ్రీహరికి గుణపాఠం చెప్పాలని, ఈ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మద్దతు ఉంటుందని మంద క్రిష్ణ మాదిగ ప్రకటించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధ్య మవుతుందన్న నమ్మకం ఉందని, ఇటీవల విశ్వరూపసభలో చేసిన ప్రకటన మేరకు ఎస్సీ వర్గీకరణకు బాటలు వేస్తున్నాడన్నారు. మోదీ మూడోసారి ప్రధానమంత్రి అవుతారని, ఎస్సీ వర్గీకరణ తథ్యమని అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి బీజేపీ తన పేరును పరిశీలించిందని, ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు తాను ఏ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించు కున్నానని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో మహాజన సోష లిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జాతీయ నాయకుడు మం దకుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు జన్ను దినేష్ మాదిగ, జిల్లా నాయకులు మంద రాజు మాదిగ, బొక్కల నారాయణ మాదిగ, బిర్రు మహేందర్ మాదిగ, కట్ట రాజేశేఖర్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేటలో చెక్‌పోస్టు వద్ద రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

డబ్బు, మద్యం రవాణాపై దృష్టిపెట్టండి

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి: ప్రావీణ్య

నర్సంపేట, మార్చి 22 : లోకసభ ఎన్నికల సందర్భంలో డబ్బు, మద్యం అక్రమ రవాణాను అరికట్టడం కోసం జిల్లాలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. పట్టణంలోని చెక్‌పోస్టు సందర్శించి రికార్డులను పరిశీలించి విధులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్‌లో గల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్‌సెంటర్, స్ట్రాంగ్‌రూమ్, ఈవీఎం, గోడౌన్‌ల వద్ద రక్షణ భద్రత చర్యలను కలెక్టర్ పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్, గార్డులు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 9 ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలు, 9 స్టాటిస్టికల్ సర్వేలెన్ టీమ్‌లు, 9 వీడియో వ్యూవింగ్ టీమ్‌లు నియమించగా నర్సంపేట నియోజకవర్గంలో 3 బృందాల చొప్పున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ విశ్వప్రసాద్, సంబంధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

- నర్సంపేట పట్టణ శివారులోని సర్వాపురం సమీపంలో నిర్మిస్తున్న 250 పడకల జిల్లా స్థాయి ఆస్పత్రి భవన నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఘనంగా లక్ష్మీనృసింహుడి కల్యాణోత్సవం



తాళిబొట్టును చూపుతున్న అర్చకులు



గీసుగొండ, మార్చి 22: కొమ్మాల శ్రీలక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతునాన్నయి. శుక్రవారం ఉత్సవమూర్తులకు హనుమత్ సేవ, నిత్యవిధి హోమం నిర్వహించారు. గురువారం రాత్రి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. లీలాదేవి, భూదేవి, లక్ష్మినరసింహకుడు ఆసీనులైన పల్లకిని కల్యాణ మండపానికి తీసుకువచ్చే సమయంలో పల్లకిని మోసేందుకు భక్తులు పోటీపడ్డారు. కొమ్మిడి వంశస్థులు అమ్మవార్లకు తలంబ్రాలు, తాళిపుస్తె, మట్టెలు తీసుకువచ్చారు. మాంగళ్యధారణ సమయంలో భక్తులు చేసిన గోవిందా నామస్మరణతో పరిసరాలు దద్దరిల్లాయి. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, విష్ణుచార్యులు, ఫణీంద్రాచార్యులు, ఎంపీపీ భీమగాని సౌజన్య, సీఐ పవన్‌కుమార్, ఎస్‌ఐలు వెంకన్న, జానీ పాష, ఎంపీటీసీ గోపాల్, ఈవో శేషగిరి నాయకులు చాడా కొమురారెడ్డి, అల్లం బాలకిశోర్‌రెడ్డి, తుమ్మన పెల్లి శ్రీనివాస్, సంస్కృతి ఫౌండేషన్ డైరెక్టర్ కక్కెర్ల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ డైరెక్టర్‌లు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో చాపలబండ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ కార్తీక్ ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని రడం భరత్ ప్రారంభించారు.

బాబోయ్.. ఎండలు!

వడగాలులతో జాగ్రత్త

- వేసవిలో ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం
- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

7

మానుకోటలో ఏసీబీ కలకలం

- లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా
- స్థలం రిజిస్ట్రేషన్‌కు చదరపుగజానికి రూ.200 అదనంగా డిమాండ్
- గత్యంతరం లేక ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- సబ్‌రిజిస్ట్రార్‌కు సహకరించిన డేటా ఎంట్రీ ఆపరేటర్ కూడా అదుపులోకి



మహబూబాబాద్‌లో తస్లీమా మహ్మద్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

మహబూబాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మానుకోటలో ఏసీబీ దాడులు కలకలం రేపాయి. బాధితుడిచ్చిన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు పథకం ప్రకారం కాపుకాసి.. జిల్లా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శుక్రవారం లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆమెతో పాటు ఆమెకు సహకరించిన ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆలేటి వెంకట్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం. దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన రైతు గుండగాని హరీష్ దంతాలపల్లి మండల కేంద్రంలో 128 గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ భూమి రిజిస్ట్రేషన్ కోసం ఈనెల మొదటి వారంలో సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌ను సంప్రదించారు. అయితే రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వ లెక్కల ప్రకారం ఫీజుకింద చదరపు గజానికి ప్రకారం రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉండగా.. దాంతో పాటు అదనంగా గజానికి రూ.200ఇవ్వాలని సబ్‌రిజిస్ట్రార్ ఆయన్ను డిమాండ్ చేశారు. ఈ క్రమంలో గజానికి రూ.150 అదనంగా ఇచ్చేందుకు హరీష్ అంగీకరించాడు. కానీ అందుకు సబ్‌రిజిస్ట్రార్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు గజానికి రూ.200చొప్పున ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో గత్యంతర లేని పరిస్థితుల్లో బాధితుడు వరంగల్‌లోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆ తర్వాత పథకం ప్రకారం మరోసారి సబ్‌రిజిస్ట్రార్‌తో మాట్లాడిన హరీష్.. తాను గజానికి రూ.150 చొప్పున 128 గజాలకు రూ.19200 అదనంగా చెల్లిస్తానని అంగీకారం కుదుర్చుకున్నాడు. ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయాలని, డబ్బు తెచ్చానని చెప్పగా.. ఆ నగదును డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకట్‌కు అందించాలని తస్లీమా సూచించారు. ఆమె చెప్పినట్టుగా నగదును ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, డేటాఎంట్రీ ఆపరేటర్ వెంకట్ అలియాస్ ఆలేటి వెంకటేశ్వర్లుకు ఇస్తుండగా అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి హరీష్ ఇచ్చిన రూ.19,200తో పాటు అంతకుముందు శుక్రవారం రోజంతా ఇతరుల నుంచి లంచాల రూపంలో వసూలు చేసిన (అన్‌అకౌంట్ మనీ) రూ.1.72 లక్షలను కూడా స్వాధీనం చేసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌తో పాటు ఆమెకు సహకరించిన వెంకటేశ్వర్లును అరెస్టు చేశారు. వారిని శనివారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈదాడుల్లో సీఐలు శ్యాంసుందర్, సునీల్‌కుమార్, రాజు పాల్గొన్నారు. మొత్తంగా ఏసీబీ దాడుల్లో తస్లీమా పట్టుబటడం జిల్లా వ్యాప్తంగా, అధికార వర్గాల్లో తీవ్ర కలవరం రేపింది. అయితే తాను కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో దంతాలపల్లి మండల కేంద్రంలో ఇటీవలే 128 గజాల ఇంటి స్థలాన్ని కొని రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే ప్రభుత్వానికి చెల్లించే ఫీజుతో పాటు అదనంగా డబ్బులు అడగడంతో ఏసీబీని ఆశ్రయించాని హరీష్ తెలిపారు. మరెవరికి ఇలా జరుగవద్దనే ధైర్యం చేశానన్నారు.

సామాజిక సేవా కార్యకర్తగా..

కొన్నేళ్లుగా సామాజిక సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ములుగు జిల్లా సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాలం నుంచి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విపత్కర సమయాల్లో గిరిజనులకు సాయమందిచడంలో ముందుండేవారన్న పేరుంది. కొవిడ్ విపత్కర సమయంలో ములుగు ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సీతక్కతో కలిసి కొండలు, గుట్టలు దాటి గిరిజనగూడేల్లోకి వెళ్లి నిత్యావసరాల పంపిణీతో పాటు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించడం, ఆ దృశ్యాలు సోషల్‌మీడియా ద్వారా ప్రజల్లోకి వెళ్లడంతో తస్లీమా అందరి ప్రశంసలు అందుకున్నారు. ఇలా సామాజిక సేవా గుణం ఉన్న ఆమె లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది.

కోల్డ్‌స్టోరేజీలపై కలెక్టర్ ఆరా

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక..
- తమ పంటను అనుమతించాలని రైతుల ఆందోళన.. నిర్వాహకులతో చర్చించిన అధికారులు



కోల్డ్ స్టోరేజీ ముందు ఆందోళనకు దిగిన మిర్చి రైతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ సిటీ, మార్చి 22: మిర్చి రైతుల దైన్యస్థితిపై శుక్రవారం ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో 'ధర లేక దాచుకునే దారి లేక, దిగాలు చెందుతున్న మిర్చి రైతులు, అన్నదాతలకు తెరుచుకోని కోల్డ్ స్టోరేజీలు' అంటూ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య డీఎంవో ప్రసాద్‌రావుతో మాట్లాడి మిర్చి రైతుల పరిస్థితి, ధరలు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునే అవకాశాలపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

కోల్డ్ స్టోరేజీల వద్ద రైతుల ఆందోళన

కోల్డ్ స్టోరేజీల్లో తమ సరుకులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ శుక్రవారం మిర్చి రైతులు ఏనుమాముల మార్కెట్ పరిధిలోని కోల్డ్ స్టోరేజీల వద్ద ఆందోళనకు దిగారు. మార్కెట్లో వ్యాపారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని, తమ పంటను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన మార్కెట్ అధికారులు స్టోరేజీ నిర్వాహకులతో మాట్లాడి రైతులకు అవకాశం కల్పించడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది.

కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులతో చర్చలు..

మార్కెట్ కార్యదర్శి సంగయ్య, డీఎంవో ప్రసాదరావు మార్కెట్ పరిధిలోని కోల్డ్ స్టోరేజీల నిర్వాహకులతో మాట్లాడి నిల్వసామర్థ్యం, ఎంత నిల్వ ఉందనే దానిపై అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ పరిధిలో 25 కోల్డ్ స్టోరేజీల్లో 27 లక్షల బస్తాలను నిల్వ చేసుకునే సామర్థ్యం ఉండగా, 25లక్షల బస్తాలను నిల్వ చేసినట్లు నిర్వాహకులు అధికారులకు వెల్లడిం చారు. ఇక మిగిలింది రెండు లక్షల బస్తాలకు మాత్రమే అవకాశం ఉం డడంతో శుక్రవారం రైతులు తీసకువచ్చిన బస్తాలను స్టోరేజీల్లో నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో తాత్కాలికంగా సమస్య సద్దుమనిగింది.

గండం గట్టెక్కేదెట్ల?

మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని మార్కెట్ అధికారులను ఆదేశించారు. మార్కెట్లో ధరలు రోజు రోజుకు తగ్గుతున్నాయి. గత ఏడాది స్టోరేజీల్లో వ్యాపారులు 10 లక్షల బస్తాలను నిల్వ చేసుకున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికే 15 లక్షల బస్తాల నిల్వ చేసుకున్నారు. ఇక రెండు లక్షల బస్తాలకే అవకాశం ఉంది. ఇది మూడు, నాలుగు రోజుల్లో నిండిపోతాయి. హోలీ పండగ తర్వాత నుంచి మార్కెట్‌కు వచ్చే మిర్చి బస్తాలను ఎక్కడ స్టోరేజీ చేస్తారు, ఎవరు కొనుగోలు చేస్తారు అన్న చర్చసాగుతోంది. కోల్డ్ స్టోరేజీల్లోకి రైతుల సరుకును నిల్వ చేయించి రైతుబంధు ద్వారా రుణం ఇచ్చి ఆదుకుందామంటే ఇప్పటికే స్టోరేజీలు నిండిపోయాయి. మిర్చిని గోదాముల్లో నిల్వ చేసే అవకాశం లేదు. కోల్డ్ స్టోరేజీల్లో వ్యాపారుల సరుకులను బయటి కోల్డ్‌స్టోరేజీలకు తరలించి ఆ స్థానంలో రైతుల సరుకును నిల్వ చేయించే ఏర్పాట్లపై ఆలోచన చేస్తున్నారు. ఈ సీజన్ గండం నుంచి గట్టెక్కేదెట్ల... అనుకుంటూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

యువకుడి అదృశ్యం

హనుమకొండ టౌన్, మార్చి 22 : హనుమకొండ నయీంనగర్‌కు చెందిన సంద్ర దిలీప్ అనే యువకుడు (25) ఈ నెల 18న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా అదృశ్యమైపోయాడని హనుమకొండ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కారుడ్రైవర్‌గా పనిచేసే దిలీప్.. ఈ నెల 18న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు ఇళ్లలో వెతికినా సమాచారం లేకపోవడంతో దిలీప్ తల్లి శోభ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఐనవోలు, మార్చి 22: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన పున్నేలు శివారు జాతీయరహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పంథిని గ్రామానికి చెందిన నస్కూరి వినోద్ ఐనవోలుకు వెళ్లి బైక్‌పై పంథినికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఏకశిల పాఠశాల సమీపంలో టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్‌కు తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.



కటాక్షపూర్‌లో చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

చెక్‌పోస్టు తనిఖీ చేసిన సీపీ

వరంగల్ క్రైం, మార్చి22: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ఆత్మకూరు మండలం కటాక్షపూర్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది నిర్వహిస్తున్న తనిఖీ తీరును సీపీ పరిశీలించారు. తనిఖీ సమయంలో ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని ఆయన సూచించారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సీపీతో ఆత్మకూరు సీఐ క్రాంతికుమార్ ఉన్నారు.

ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, మార్చి 22: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డు బంద్ సెలవు, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం హోలీ పండుగను పురస్కరించుకుని సెలవు ప్రకటించారు. తిరిగి మంగళవారం మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ కార్యదర్శి ఆ ప్రకటనలో తెలిపారు.

వరంగల్ మార్కెట్లో తగ్గిన పంటల ధరలు

వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో వివిధ పంట సరకులకు గురువారంతో పోలిస్తే శుక్రవారం మరింత తగ్గాయి. పత్తి క్వింటాకు రూ.7,315 శుక్రవారం రూ. 7,250 పలికింది. సింగిల్‌పట్టి మిర్చి క్వింటాకు రూ.45,600 లకు రూ.42వేలు పలికింది. తేజా రూ.19,800లకు రూ. 19,300, వండర్‌హాట్ రూ.15,500లకు రూ.15వేలు, యుఎస్ 341 రకం రూ.16,500లకు రూ.15వేలు ధర పలికింది. అలా గే, దీపిక రూ.14వేలు పలికింది. దేశీ రకం రూ.34వేలకు రూ.30వేలు, తాలు రూ.8వేలకు రూ.8,500 ధర పలికింది.

అక్రమాలకు కేరాఫ్ కేయూ!

ఆరోపణలు, వివాదాలకు కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ



(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తన చదువులమ్మ చెట్టు నీడలో ఎందరినో మహానుభావులుగా తీర్చిదిద్దిన కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ట దిగజారుతోంది. యూనివర్సిటీ నిర్వహణ వ్యవహారాల గురించి గత ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవటంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, ఫలితంగా అనేక అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. తాజా వెలుగులోకి వచ్చిన పలు అక్రమాలతో ఇదంతా వాస్తవమేనన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆన్సర్ షీట్ స్కానింగ్ టెండర్ల రద్దు, రీటెండర్ వ్యవహారం దుమారం రేపుతోంది. కాకతీయ యూనివర్సిటీలో 32పేజీలు ఉండే యూజీ, పీజీ పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలను స్కానింగ్ చేయటం కోసం ఫిబ్రవరి 2వ తేదీన ఈ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. టెండర్ బిడ్ సమర్పించడానికి మార్చి6 వరకు గడువు విధించారు. ఇలా వచ్చిన దరఖాస్తుల టెక్నికల్ బిడ్‌ను మార్చి 7న, కమర్షియల్ బిడ్‌ను 13వ తేదీన ఓపెన్ చేయాల్సి ఉంది. ఈ స్కానింగ్ టెండర్‌కు మూడు కంపెనీలు బిడ్ దాఖలు చేయగా.. అందులో కోజిన్ లిమిటెడ్ కంపెనీ మిగతా రెండింటి కంటే తక్కువగా ఒక ఆన్సర్ షీట్ డిజిటలైజేషన్‌కు రూ.14.51కు కోట్‌చేసింది. నిబంధనల ప్రకారం టెండర్‌ను కోజిన్ కంపెనీకి ఇవ్వాల్సి ఉంది. కానీ, అనుహ్యంగా కేయూ వీసీ ఆ టెండర్‌ను రద్దు చేసి మళ్లీ ఈ నెల 16న రీటెండర్‌కు నోటిఫికేషన్ జారీ చేయటం వివాదాస్పదమైంది. పాత టెండర్‌ను ఎందుకు రద్దు చేశారో చెప్పకుండా రీ టెండర్ నోటిఫికేషన్ వేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలమైన కంపెనీకి టెండర్ దక్కకపోవటంతోనే రద్దు నిర్ణయం తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి నిబంధనల ప్రకారం రూ.5లక్షల దాటే ఏ పనికైనా తప్పనిసరిగా టెండర్లు ఆహ్వానించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వంలో మూడేళ్లుగా ఎలాంటి టెండర్లు లేకుండా ఆన్సర్ షీట్ స్కానింగ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత టెండర్లపై దృష్టిపెట్టడంతో రూ.2కోట్లతో చేపట్టే ఆన్సర్ షీట్ల స్కానింగ్ పనులకు ఈసారి టెండర్లు పిలిచి, వాటిని ఆకారణంగా రద్దు చేసిన కేయూ అధికారుల నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఈ టెండర్ రద్దుపై పలువురు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కేయూ వీసీ, రిజిస్ట్రార్‌లపై ఫిర్యాదు చేయటం కలకలం రేపుతోంది.

ఆధ్యాపకుల నియమాకంలో అక్రమాలే..

కేయూలో ఇటీవల నియమించిన అనుబంధ అధ్యాపకుల(అడ్జంట్ ఫ్యాకల్టీ)ను నిబంధనలకు విరుద్ధంగా నియమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూజీసీ నిబంధనల ప్రకారం అడ్జంట్ ఫ్యాకల్టీ నియమకానికి ముందస్తుగా నోటిఫికేషన్ ఇవ్వాలని, వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధిపతులు పరిశీలించి రిజిస్ట్రార్‌కు పంపించాల్సి ఉంటుందని యూనివర్సిటీ అధ్యాపకులు పేర్కొంటున్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న వారి నుంచి అధ్యాపకులను ఎంపిక చేసేందుకు ఐదుగురితో కూడిన సెలక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదనే విమర్శలున్నాయి. సెలక్షన్ కమిటీ లేకుండా కేయూలో గతేడాది జనవరి 30న 12 మందిని, మార్చిలో నలుగురిని కలిపి మొత్తం 16 మందిని పాలక మండలి అనుబంధ అధ్యాపకులుగా నియమించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. 2014 సెప్టెంబరులో ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలో ఎలాంటి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకూడదని ఆదేశాలున్నా యూనివర్సిటీ అధికారులు పట్టించుకోకుండా నియామకాలు చేశారని, వీరి కి ఒక్కొక్కరికి నెలకు రూ.50వేల చొప్పున 16మంది కి ప్రతినెల రూ.8లక్షల వేతనాలు చెల్లిస్తున్నారని, అయితే ఇప్పటి వరకు వీరు ఎలాంటి పరిశోధనలు చేయడం లేదని, క్లాసులు తీసుకోవటం లేదని, దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫామ్-డి అనుమతిలో నిబంధలు బేఖాతరు

ఫార్మసీ కాలేజీలకు అనుమతుల్లోనూ కేయూ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేయూ పరిధిలో మొత్తం 24 ఫార్మసీ కాలేజీలుండగా వీటిలో బీఫార్మసీ, ఎంఫార్మసీ కోర్సులున్నాయి. అయితే 12కాలేజీలు డీఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతులు కోరుతూ యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే ఫామ్-డి కోర్సు నిర్వహించే కాలేజీలకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి పొందిన 300 పడకల ఆస్పత్రులు అనుబంధంగా ఉండాలి. కానీ దరఖాస్తు చేసుకున్న 12కాలేజీల్లో.. కేర్ ఫార్మసీ, సహస్ర ఫార్మసీ, వాగ్దేవీ హనుమకొండ, సెయింట్ పీటర్, తాళ్ల పద్మావతి కాలేజీ, ఖమ్మం ఫార్మసీకాలేజీలు మాత్రమే 300 పడకల ఆస్పత్రులను అనుబంధంగా కలిగి ఉన్నాయి. మిగతా ఆరు కాలేజీలకు ఎలాంటి అనుబంధ వైద్యశాలలు లేకపోయినా యూనివర్సిటీ అధికారులు అనుమతులు ఇచ్చారు. కేయూ అధికారుల తమకు అనుకూలమైన వారిని తనఖీలకు పంపించి, తప్పుడు నివేదికల ఆధారంగా ఆ కళాశాలలకు అనుమతులిచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు

పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలతో కేయూ పరువు బజారుకెక్కింది. 2017లో పీహెచ్‌డీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు ఆరేళ్ల పాటు పట్టించుకోలే దు. విద్యార్థుల ఆందోళనలతో దిగివచ్చిన కేయూ అధికారు లు 2023లో అడ్మిషన్లకు షెడ్యూల్ ప్రకటించింది. పీహెచ్‌డీ అడ్మిషన్లలో 75శాతం రెగ్యులర్ ప్రాతిపదికన, 25శాతం పార్ట్ టైం ప్రాతిపదికన కేటాయించారు. మే 27, 2022లో కేటగిరి-1 ఇంటర్వ్యూలు నిర్వహించి.. అదే ఏడాది మార్చి 21న కేటగిరి-2లో సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టు 29న ఫలితాలు వెల్లడించారు. అయితే ఇంటర్వ్యూలో అధికారులు నిబంధనలు పాటించలేదని, అవకతవకలకు పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపిస్తూ గత సెప్టెంబరులో ఆందోళనకు దిగా రు. కేటగిరి-2 అడ్మిషన్లలో కొందరు ప్రొఫెసర్లు సీట్లు అమ్ముకున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగగా పదిమంది విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేసి ఇద్దరిని జైలుకు పంపించారు. దీనిపై విద్యార్థులు అప్పటి గవర్నర్ తమిళిసైను కూడా కలిసి పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు చేశారు. దీనిపై కొత్త ప్రభుత్వం ఫిబ్రవరి 16న త్రిసభ్య కమిటీని వేసింది. కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలను వెలికి తీసేందుకు ఆ త్రిసభ్య కమిటీ సభ్యులు కేయూలో పర్యటించి వీసీ, రిజిస్ట్రార్‌లతో పాటు ఆధ్యాపకులు, విభాగాల అధిపతులు, విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. అయితే గత బుధవారం త్రిసభ్య కమిటీ నివేదిక ఇచ్చినా అందులో ఏముందో యూనివర్సిటీ అధికారులు బయట పెట్టకపోడంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కాగా, వీటితో పాటు కేయూలో ఆరుగురు ప్రొఫెసర్లతో కలిసి సీడ్‌మనీ పేరుతో నకిలీ పరిశోధన ప్రాజెక్టులు మంజూరు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎలాంటి పరిశోధనలు చేయకుండా రూ.20లక్షల నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ల, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే చర్చ జరుగుతోంది. రిజిస్ట్రార్, వీసీ నియామకాలతో పాటు పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకాలపై వివాదం కొనసాగుతుండగా.. ఇప్పటికే ప్రభుత్వం యూనివర్సిటీపై దృష్టిసారించి ప్రత్యేక విచారణ కమిటీలు, విజిలెన్స్ విచారణకు కూడా ఆదేశించింది. కేయూలో జరుగుతున్న అవతవకలపై అకుట్ ఆధ్వర్యంలో అనేకమార్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసింది. మొత్తం మీద రాష్ట్రంలో రెండో అతి పెద్ద యూనివర్సిటీగా ఉన్న కేయూలో కొంతకాలంగా వస్తున్న అక్రమాల ఆరోపణలు, విద్యార్థులు, ఆధ్యాపకుల ఆందోళనలతో ప్రతిష్ట మసకబారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్‌లో గడువు తీరిన ఔషధాల విక్రయం

వరంగల్ మెడికల్, మార్చి 22: రోగికి గడువు తీరిన ఔషధాలు విక్రయించిన ఘటనపై వరంగల్ ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని శ్రీ సృష్టి హాస్పిటల్ వైద్యురాలు దొడ్డ సంధ్య దగ్గరకు లలిత అనే గర్భిణీ పరీక్ష నిమిత్తం ఈ నెల 18న వెళ్లింది. వైద్యురాలు గర్భిణీకి పరీక్ష నిర్వహించి పోల్‌విన్-డీహెచ్ఏ మా త్రలు రాసింది. ఇదే హాస్పిటల్ ఆవరణలోని తిరుమల ఫార్మసీలో మందులు కొనుగోలు చేశారు. ఎక్స్‌పైరీ తేదీ దగ్గర కట్ చేసి నాలుగు షీట్స్ విక్రయించారని రోగి భర్త ఎం.మహేశ్ ఫిర్యాదు చేశారు. వరంగల్ ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఈ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మందుల విక్రయాలపై డీఎంఈ ఆరా

వరంగల్ మెడికల్, మార్చి 22: ప్రాంతీయ ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఫార్మసిస్టు మందులను ప్రయివేట్ వ్యక్తులకు విక్రయించిన ఘటనపై వైద్య విద్య డైరెక్టర్ తీవ్రంగా స్పందించారు. ఆర్ఈహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్‌రెడ్డి సెలవులో ఉండటంతో ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ వెంటనే విచారణ జరపాలని ఆదేశించారు. ఈ ఆదేశాలతో శుక్రవారం ఉదయం డాక్టర్ చంద్రశేఖర్ ఆర్ఈహెచ్‌ను సందర్శించారు. మందులు బయటికి తరలివెళ్లిన విషయాలపై ఆరా తీశారు. సమగ్ర నివేదికను డీఎంఈకి పంపనున్నారు. కాగా, ఎఫ్ఐఆర్ కాపీ అందించిన వెంటనే ఫార్మసిస్టు తలకోటి నాగేందర్‌ను సస్పెండ్ చేయనున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

ఏప్రిల్ 1 నుంచి దివ్యాంగుల ప్యాసింజర్ వాహనాల రాయితీ రద్దు

వరంగల్ చౌరస్తా, మార్చి 22: డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఆదేశానుసారం జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా అమలు చేయబడుతున్న టీ-ప్రైడ్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు ప్యాసింజర్ వాహనాలకు కల్పించే రాయితీ ఏప్రిల్ 1 నుంచి రద్దు చేయబడిందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శుక్రవారం నర్సింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన రాయితీలు యథావిధిగా అమల్లో ఉంటాయన్నారు. రద్దు చేయబడిన లబ్ధిదారులు ఆ రాయితీని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా పొందవచ్చని ఈ మార్పును లబ్ధిదారులు గమనించాలని నర్సింహమూర్తి తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, మార్చి22: గీసుగొండ మండలంలోని రెడ్డిపాలెం, హసన్‌పర్తి మండలంలోని ఎల్లాపూర్‌లో బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో రెడ్డిపాలెంలో రూ.61,210, ఎల్లాపూర్‌లో రూ.5100 అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూధన్ ధృవీకరించారు.

అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఎం రేవంత్ రెడ్డికి అర్చక ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి



సీఎంను కలిసి సమస్యలను నివేదిస్తున్న అర్చక ఉద్యోగుల జేఏసీ నాయకులు

హనుమకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అర్చక ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలన్నిటినీ పరిష్కరించాలని అర్చక ఉద్యోగుల జేఏసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభ్యర్థించింది. శుక్రవారం అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ నేతృత్వంలో అర్చకులు సీఎంను హైదరాబాద్‌లోని ఆయన నివాసగృహంలో కలిశారు. అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా జీవో నెంబరు 577 ప్రకారం అర్చక ఉద్యోగులందరికీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,627 మందికి వేతనాలు చెల్లించాల్సి ఉండగా, దేవాదాయ అధికారుల నిర్లక్ష్యంవల్ల ప్రస్తుతం మూడు వేల మందికి మాత్రమే వస్తున్నాయని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. మిగతా వారికి కూడా వచ్చేట్టు తగిన చర్యలు తీసుకోవలసిందిగా వారు కోరారు. 121 జీవో తొలగించడంవల్ల పూర్తిస్థాయిలో అందరికీ గ్రాంట్ ఎయిడ్ ద్వారా వేతనాలు వస్తాయని తెలిపారు. రెండేళ్లుగా దేవాదాయ శాఖలో కారుణ్య నియామకాలు లేవని తెలిపారు. 200మంది అర్చక ఉద్యోగుల పిల్లలను కారుణ్య నియామకాల ద్వారా నియమించాలని కోరారు. అర్చక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినా అర్చక ఉద్యోగులకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రతీ అర్చక ఉద్యోగికి ఆరోగ్య బీమా వర్తింప చేయాలని సీఎంను అభ్యర్థించారు. రిటైరైన ఉద్యోగులకు రూ.10లక్షల చొప్పున గ్రాట్యుటీ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రతీనెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, గ్రామీణప్రాంత ధూప, దీప, నైవేద్య అర్చకులకు ఉద్యోగభద్రత కల్పించాలని, వారి గౌరవ వేతనాన్ని రూ.25వేలకు పెంచాలని, ధార్మిక భావన కలిగిన వారిని దేవాలయ ధర్మకర్తల మండలిలో నియమించాలని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. వెంటనే ఓఎస్‌డీని పిలిచి అర్చక ఉద్యోగుల సమస్యలపై రెండు రోజుల్లో నివేదిక అందచేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు క్రిష్ణమాచారి, పరాశరం రవీంద్రాచారి, అర్చక జేఏసీ కన్వీనర్ అగ్నిహోత్రం చంద్రశేఖర్ శర్మ, కర్మాఘాట్ దేవాలయం అర్చకులు అంబా ప్రసాద్ శర్మ, సంతోష్ కుమారాచార్యులు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండారి జగపతి, ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెన్నా మోహన శర్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు.. ఒకరికి గాయాలు

హనుమకొండ టౌన్, మార్చి 22 : హనుమకొండ కేయూ రోడ్డులోని గోపాల్‌రావు బిల్డింగ్ ఏరియాలో ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనదారుడు యూ టర్న్ తీసుకుంటుండగా కారు ఢీకొని గాయపడ్డ ఘటన ఈ నెల 11న చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వికాస్‌నగర్‌కు చెందిన ఎల్లస్వామి డబ్బాల నుంచి రెడ్డికాలనీ వైపు వస్తుండగా గోపాల్‌రావు బిల్డింగ్ వద్ద కారు డ్రైవర్ మద్యం మత్తులో అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడి ఎడమ కాలు విరిగింది. బాధితుడి అల్లుడు దండు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

ధర్మసాగర్, మార్చి 22: అక్రమంగా మట్టిని రవాణాచేస్తున్న టిప్పర్లను ఎస్సై నర్సింగరావు శుక్రవారం పట్టుకున్నారు. నష్కల్‌కు చెందిన కొతుల రాజు, యాకయ్యలు ఎక్స్‌కావేటర్, టిప్పర్లతో వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామ శివారు గట్టుమల్లికార్జున దేవస్థానం నుంచి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి వద్దకు రాగానే పోలీసులు వాహనాలను పట్టుకున్నారు. అనంతరం టిప్పర్లను పీఎస్‌కు తరలించి యజమానులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

రైల్వే కో ఆప్షన్ మెంబర్‌గా రాఘవేందర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న రాఘవేందర్

కాజీపేట, మార్చి 22: సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అనుబంధంగా నడుస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో- ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ల సర్వసభ్య సమావేశం శుక్రవారం సికింద్రాబాద్‌లో జరిగింది. కాజీపేట రైల్వేవిభాగంలో పనిచేస్తున్న దేవులపల్లి రాఘవేందర్‌ను కో ఆప్షన్ డైరెక్టర్‌గా నియమించారు. రాష్ట్ర సంఘం నాయకుల చేతుల మీదుగా రాఘవేందర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు శంకర్‌రావు, పిల్లలమర్రి రవీందర్, షేక్ ఖాజాబాబ, చినుకు స్వామిలకు రాఘవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.



బాబోయ్.. ఎండలు!

● వడగాలులతో జాగ్రత్త ● వేసవిలో ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం ● ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

వరంగల్ మెడికల్, మార్చి 22: ఎండలు బాబోయ్ ఎండలు.. అంటూ జనం బేజారవుతున్నారు. మార్చి మొదటివారం నుంచే మండే ఎండలు ముంచుకొచ్చాయి. ఇక ఏప్రిల్, ఇక మే నెలను తలుచుకుంటే జనం బెంబేలెత్తుతున్నారు. వాతావరణ శాఖ కూడా ఈ ఏడాది ఎండలు దంచనున్నాయని ముందే హెచ్చరించింది. కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు భానుడి ప్రతాపానికి విలవిలలాడుతున్నారు. వడదెబ్బతో ఇప్పటికే మంచాన పడుతున్నారు. ఎండ వేడిమి నుంచి తమను తాము రక్షించుకోవడానికి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వర్గాలు చెబుతున్నాయి.

వడదెబ్బ ఎలా సోకుతుంది?

ఎండ తీవ్ర ఉన్నప్పుడు మనిషి మెదడులో ఉన్న ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్రం దెబ్బతినడం వల్ల, ఎక్కువసేపు ఎండలో ప్రయాణం చేసిన పని చేసిన వడదెబ్బ తగులుతుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత 108 ఫారన్‌హీట్ నుంచి 110 ఫారన్‌హీట్‌ల వరకు పెరుగుతుంది. వడదెబ్బ తగిలిన వారిలో 40శాతం మరణాలు సంభవించే అవకాశం ఉంటుందని వైద్య వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

వడదెబ్బ లక్షణాలు

శరీరం నీరసించి పోవడం, విపరీతమైన దాహం, మూత్ర విసర్జనలో మంట తీవ్ర, చర్మం ఎర్రగా మారి వేడిగా ఉండడం, నీళ్ల విరేచనాలు, తల తిరగడం, మగతగా ఉండి అపస్మారక స్థితికి చేరడం. వాంతులు చేసుకోవడం.

వెంటనే అందించాల్సినవి

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ లేదా గాలి ఉన్న ప్రదేశానికి చేర్చాలి. ఆ తరువాత శరీరంపై ఉన్న దుస్తులు తొలగించి ఐస్ ముక్కలతో చల్లని నీటితో కానీ శరీరం అంతా తుడవాలి. కొబ్బరినీరు, నిమ్మరసం, మజ్జిగ ద్రావణాన్ని తొలగించాలి. అయినా రోగి కోలుకోకపోతే వెంటనే ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాం..

డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు



ఎండలు ముదురుతున్న దృష్ట్యా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, ఆరోగ్య ఉప కేంద్రాల, తన ఆరోగ్య కేంద్రాల సిబ్బందిని అలర్ట్ చేశాం. క్షేత్రస్థాయిలో వడదెబ్బ సోకిన వారి వివరాలు సేకరించేందుకు యంత్రాంగం పూర్తి కార్యాచరణతో ఉంది. పిల్లలు, వృద్ధులు తొందరగా వడదెబ్బ సోకే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. ఆరోగ్య శాఖ కూడా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సెలైన్ బాటిల్స్ సరిపడా నిల్వలు ఉన్నాయి. త్వరలో ప్రత్యేక వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తాం. 108, 104 సేవలు కూడా ముమ్మరం చేస్తాం, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.





ఆంధ్రజ్యోతి WARANGAL CITY

వరంగల్ సిటీ

8

● వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ ● సంగెం

శనివారం 23 మార్చి 2024

నీటి నమూనాల సేకరణ

సంగెం, మార్చి 22 : బిక్కోజీనాయక్ తండా, వీఆర్ఎన్ తండాలలో శుక్రవారం నీటి నమూనాలను సేకరించారు. ప్రాంతీయ నీటి పరిశోధనా శాల సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్టు డాక్టర్ కృష్ణారావు ఆధ్వర్యంలో నీటి నమూనాలను సేకరించారు. ప్రజలకు సురక్షితమైన నీటిని అందించడంలో భాగంగా పరీక్షల కోసం పంపడం జరిగిందన్నారు. శాంపిల్ కలెక్షన్ ఎండీ సలావు ద్దిన్, వైద్యాధికారి డాక్టర్ ఉదయ్, డాక్టర్ దివ్య, గ్రామ కార్యదర్శి రమేష్, స్వప్న, ఏఎన్ఎం సంధ్య, హెల్త్ అసిస్టెంట్ రంజిత్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



నీటి నమూనాలను సేకరించిన అధికారులు

దేవాలయ భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

వరంగల్ కల్చరల్, మార్చి 22: శ్రీభద్రకాళి అమ్మవారి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం చిన్న కోవెల సంబంధించిన దేవస్థానం భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు శ్రీభద్రకాళి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శేషు భారతి తెలిపారు. సర్వే నంబర్ 809లో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న ప్రహరీని తొలగించినట్లు శేషు భారతి తెలిపారు.

అక్రమంగా వెంచర్లు చేస్తే కఠిన చర్యలు

● బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న నాయక్ ● శాయంపేటలో అక్రమ వెంచర్ల తొలగింపు ● నిబంధనలు పాటించాలని హుకుం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 22: మున్సిపల్ శాఖ అనుమతులు లేకుండా అక్రమ లే అవుట్ వెంచర్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న నాయక్ హెచ్చరించారు. గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ న్యూశాయంపేటలో ప్రభుత్వ అనుమతులు లేకుండా సర్వే నెంబర్ 350, 351లో అక్రమంగా వెంచర్‌లో నిర్మిస్తున్న కట్టడాలను శుక్రవారం అడ్డుకుని నిలిపివేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఖలీల్ ఆధ్వర్యంలో డీఆర్ఎఫ్ టీం సిబ్బంది అక్రమ నిర్మాణాలను తొలగించారు. జేసీబీ, డోజర్ సహాయంతో హద్దురాళ్లను, మట్టి రోడ్డును ధ్వంసం చేశారు. వెంచర్ యజమానులకు నోటీలు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకన్న నాయక్ మాట్లాడుతూ.. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో వెంచర్లు చేయాలనుకుంటే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టీఎస్ బీపాస్ ద్వారా దరకాస్తు చేసుకుని అనుమతులు పొందిన తర్వాతనే కట్టడాలు జరపాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్లాట్లు కొనుగోలు చేసే వారు నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు ఉన్న వెంచర్లలో మాత్రమే కొనుగోలు చేయాలని, లేదంటే తర్వాత ఇబ్బందులు వస్తాయని హెచ్చరించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్, డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమ లే అవుట్‌లను తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

పండ్లు, ఆకుకూరలతో సంపూర్ణ ఆరోగ్యం

వరంగల్ చౌరస్తా, మార్చి 22: పండ్లు, చిరుధాన్యాలు, ఆకు కూరలతో గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని వరంగల్ సీడీపీవో విశ్వజ అన్నారు. పోషణ పక్వాడ్ ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం రామన్నపేట 29వ డివిజన్‌లో వేడు కలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎ.ఛాయాదేవి, అంగన్ వాడీ టీచర్లు లలిత, సమత, రమ, ఎ. పద్మ, స్వరూప, టి. పద్మ, నసీన్ పాల్గొన్నారు.

పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవాలి

సంగెం, మార్చి 22 : పాడి పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవాలని సంగెం పశు వైద్యాధికారి వల్లె రాజు చెప్పారు. మొండ్రాయి, గొల్లపల్లి గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా రాజు రైతులకు పలు సూచనలు చేశారు. గాలికుంటు వాధ్యుల వల్ల కలిగే నష్టాలను వివరించారు. గోపాలమిత్ర కమలాకర్, బాబు, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై మెడికల్ కమిషన్‌కు ఫిర్యాదు

కరీమాబాద్, మార్చి 22: ప్రభుత్వ వైద్యులు జీతాలుగా తీసుకుంటూ ప్రైవేటు క్లినిక్‌లు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజా తంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి డి.సాంబమూర్తి, హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు, పబ్లిక్ రిలేషన్ చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర చైర్మన్‌కు పోస్ట్ ద్వారా లేఖ సైతం పంపించారు. వారు మాట్లాడుతూ కాకతీయ మెడికల్ కళాశాల, వైద్యశాల, ఎంజీఎం ఆస్పత్రు ల్లో పనిచేస్తున్న వైద్యులు లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటున్నా సరైన వైద్య సేవలు అందించడం లేదన్నారు. కనీసం ఓపీ కూడా చూడటం లేదని ఆరోపించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలు అందించాల్సిన సమయంలో ప్రైవేటు క్లినిక్‌లు నిర్వహిస్తూ వైద్యం పేరుతో ప్రజలను దోచుకుంటున్నారన్నారు. జిల్లా వైద్య అధికారులు, సూపరింటిండెంట్‌లు ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్యూటీలో ఉండాలని ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. పలివేల్పుల కు చెందిన పసునూరి దేవేందర్ మృతికి కారణమైన యూరాలజీ డాక్టర్ రణధీర్ రెడ్డిపై విచారణ జరిపి, అతడి సర్టిఫికెట్లు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.



డాక్టర్ నరేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఎంపీపీపై అవిశ్వాసానికి అనుమతివ్వాలి

ఆర్డీవోకు వినతిపత్రం సభ్యుల వినతి

సంగెం, మార్చి 22: సంగెం ఎంపీపీ కందకట్ల కళావతిపై అవిశ్వాసం పెట్టేందుకు అనుమతిని ఇవ్వాలని సంగెం మండల ఎంపీటీసీలు వరంగల్ ఆర్డీవో సీదం దత్తుకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం హనుమకొండలోని ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన వారిలో మండల వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రంగరాజు నర్సింహస్వామి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, ఎంపీటీసీల ఫోరం మండలశాఖ అధ్యక్షుడు రంగరాజు నర్సింహస్వామి, కాపులకనపర్తి ఎంపీటీసీ సుతారి బాలకృష్ణ, ఎల్గూరురంగంపేట ఎంపీటీసీ బానోతు పద్మ, పల్లార్‌గూడ ఎంపీటీసీ గుగులోతు వీరమ్మ, చింతలపల్లి ఎంపీటీసీ బొమ్మ పావని, కాట్రపల్లి ఎంపీటీసీ గాయపు ప్రచూర్ణ, నల్లబెల్లి ఎంపీటీసీ కట్ల సుమలత, లోహిత ఎంపీటీసీ అడ్డగట్ల దుర్గారావు, మొండ్రాయి ఎంపీటీసీ కొనకటి రాణి, సంగెం ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఎంపీపీ పదవికి కళావతి రాజీనామా చేయాలి

బీఆర్ఎస్‌తో ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా కొనసాగుతున్న కందకట్ల కళావతి తన పదవికి రాజీనామా చేయాలని సంగెం ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. శుక్రవారం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఇంతకాలం పదవి అనుభవించి, కన్నతల్లిలాంటి పార్టీని వీడుతున్న కళావతి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీలో ఉంటూ పార్టీకి ద్రోహం చేయాలని చూసే వారని సహించేదిలేదన్నారు. మండలంలోని బీఆర్ఎస్‌కు చెందిన వారు వీరి మాటలు నమ్మి పార్టీకి దూరం కావద్దని హితవు పలికారు. పరకాల నియోజక వర్గంను అభివృద్ధిని చేసిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వెంట ఉంటామన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, ఎంపీటీసీల ఫోరం మండలశాఖ అధ్యక్షుడు రంగరాజు నర్సింహస్వామి, కాపులకనపర్తి ఎంపీటీసీ సుతారి బాలకృష్ణ, ఎల్గూరురంగంపేట ఎంపీటీసీ భానోతు పద్మ,పల్లార్‌గూడ ఎంపీటీసీ గుగులోతు వీరమ్మ, చింతలపల్లి ఎంపీటీసీ బొమ్మ పావని, కాట్రపల్లి ఎంపీటీసీ గాయపు ప్రచూర్ణ,నల్లబెల్లి ఎంపీటీసీ కట్ల సుమలత,లోహిత ఎంపీటీసీ అడ్డగట్ల దుర్గారావు,మొండ్రాయి ఎంపీటీసీ కొనకటి రాణి,సంగెం ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, మండల కోఆప్షన్ మెంబరు మన్సూర్‌అలీలు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న ఎంపీటీసీలు

ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం

గీసుగొండ, మార్చి 22: ప్రపంచ నీటి దినోత్సవాన్ని వంచనగిరి మోడల్ స్కూల్లో బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవటం అలవర్చుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. నీటి ఆవశ్యకత గురించి విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వకృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను అందచేశారు. అనంతరం ర్యాలీని నిర్వహించారు. బాలవికాస సంస్థ ప్రతినిధి మల్లారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 9 మందికి జరిమానా

మట్టెవాడ, మార్చి 22: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 9 మందికి జరిమానా విధిస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులు 9 మందికి రూ. 15,900 జరిమానా విధించారు. వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ. 3800 జరిమానా విధించారు.

అబ్జర్వేషన్ హోంకు మైనర్ల తరలింపు..

నగరంలో మైనర్లు డ్రైవింగ్ చేస్తూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుపడ్డారు. 8 మందిని శుక్రవారం జువైనల్ కోర్టులో హాజరు పర్చగా కోర్టు 8 మంది మైనర్లను రెండు రోజుల పాటు అబ్జర్వేషన్ హోంకు తరలించాలని తీర్పు నిచ్చారు. దీంతో బాలల అబ్జర్వేషన్ హోంకు తరలించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

గీసుగొండ, మార్చి 22: ఈ నెల 17న ఓసిటీలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు 15వ డివిజన్ గొర్రెకుంట జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ల్యాదెల్ల అక్షయ్, ల్యాదెల్ల ప్రస్థిక్, నమిండ్ల వైభవ్ లు ప్రతిభ కనబరిచిన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జ్యోతిర్మయి, పీఈటీ రఘువీర్‌లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 23,24 తేదీల్లో ఆలేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

గాయపడిన ఉపాధ్యాయులకు అండ

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 22: గాయపడిన ఉపాధ్యాయులకు పీఆర్టీయూ తెలంగాణ సంఘం అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు కోలెపాక సంగీత అన్నారు. ఇటీవల ఏసీబీ రైడ్ చేయడానికి వెళలుతున్న ఏసీబీ అధికారులు సాక్షులుగా తమ వెంట ఇద్దరు ఉపాధ్యాయులను తీసుకెళుతున్న సమయంలో కారు ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. జి.భిక్షపతి అనే ఉపాధ్యాయుడు కోమాలోకి వెళ్లగా, ఎ.కృష్ణమూర్తి అనే ఉపాధ్యాయుడికి కాలు విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆవేదన చెందారు. ఈ విషయమై సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఉమాకర్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ ఏసీబీ అధికారులు, విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఇద్దరు ఉపాధ్యాయులకు ఓడీ ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు స్థానిక డీఈవో డి.వాసంతిని కలిసి ఇద్దరు ఉపాధ్యా యులకు జరిగిన ప్రమాద సంఘటనకు సంబంధించిన నివేదికను విద్యాశాఖకు సత్వరమే పంపించి వారికి సహాయం చేయాలని కోరామన్నారు. సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా ప్రధానకార్యదర్శి రావుల్‌కార్ వెంకటేష్, ములుగు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రవి, పి.రామన్న పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నేతలు

మార్కెట్లో ముందస్తు హోలీ సంబురాలు



హోలీ సంబరాల్లో పాల్గొన్న దడువాయి కార్మికులు

వరంగల్ వ్యవసాయం, మార్చి 22: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం దడువాయి కార్మికులు ముందస్తు హోలీ సంబురాలు జరుపుకున్నారు. మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించడంతో సోమవారం కలుసుకునే అవకాశం లేకపోవడంతో దడువాయి కార్మికులు హోలీ సంబురాలు జరుపుకున్నారు. రంగులు చల్లుకుని, స్వీట్లు పంచుకుని నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు.

కళాశాలలో యోగా శిక్షణ తరగతులు



ధ్యానం, యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థినిలు

కరీమాబాద్, మార్చి22: రంగశాయిపేట సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ధ్యానం, యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు. హైదరాబాద్ రామచంద్ర మిషన్, కన్హా శాంతివన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో రిటైర్డ్ డీజీపీ డాక్టర్ ఆదిత్య ఆర్యా, డాక్టర్ అనంత్ మాధవ మోహన్ పాల్గొన్నారు. ఆదిత్య మాట్లాడుతూ పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత దాజి నిర్దేశింపబడిన హార్ట్‌ఫుల్‌నెస్ ధాన్యం, యోగాతో మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.సురేష్‌కుమార్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



రేవూరి ప్రకాష్‌రెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

సంగెం, మార్చి 22 : సంగెం మండలం బిక్కోజీనాయక్ తండాలో శుక్రవారం బీఆర్ఎస్, బీజేపీ నుంచి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. గ్రామ బీఆర్ఎస్ తాజా మీజీ సర్పంచ్ బానోతు వంశీరాజ్, వార్డు సభ్యులు భూక్యా రాజు, బానోతు బిచ్యా, బిఆర్ఎస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు బూక్యా వీరన్న, బిజేపీ గ్రామ యూత్ నాయకులు గుగులోతు రవీందర్ చేరారు.

● ఖిలావరంగల్: రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కరాటే ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మంత్రి కొండా సురేఖ ఆదేశాలమేరకు శివనగర్, భూపేష్‌నగర్‌లో డివిజన్ అధ్యక్షుడు చిట్టిమళ్ళ శ్రీనివాసరావు అధ్యక్షతన బీజేపీ, బీఆర్ఎస్‌పార్టీల నుంచి వంద మంది మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో 34వ, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కొనకంచి కృష్ణకుమారి, పంచరాని స్రవంతి, శెట్టి రాజేష్, కొతి స్వరూప, జేతి ఉమామహేశ్వరి, పసునూటి ప్రేమలత, ఇంజమూరి కల్పన, తడికపెల్లి కవిత, మెరుగు పూర్ణిమ, గర్నెపల్లి స్వప్న, పానిగంటి లత, గద్దాసు లక్ష్మి, రమ పాల్గొన్నారు.

'వెయ్యికోట్లతో ఆటో డ్రైవర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'



ఆటో బ్రతుకులు పోస్టర్ ఆవిష్కరిస్తున్న నటుడు రవికుమార్

వరంగల్ సిటీ, మార్చి 22: ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రూ. వెయ్యి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని 'ఆటో బతుకులు' సీరియల్ హీరో మంద రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్స్ బతుకులపై వంద ఎపిసోడ్లతో రూపొం దించిన ఆటో బతుకులు సీరియల్ ప్రచారయాత్ర రథం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలను తిరుగుతూ శుక్రవారం వరంగల్ ఓసిటీకి చేరుకుంది. తాడు రాష్ట్ర నాయకులు ఇమ్మడిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. రవికుమా ర్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ఏదో రకమైన సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నా, ఆటో డ్రైవర్ల సంక్షే మం కోసం మాత్రం చర్యలు తీసుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు దారా సూరి, అక్కినపల్లి అంజయ్య, సార మహేందర్, ఆవుల నవీన్‌కుమార్, మస్కె కరుణాకర్, ఆమంచ ప్రశాంత్,పెసరు శివ, పోశాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'కోల్డ్ స్టోరేజీల్లో మిర్చి పంటను నిల్వ చేయాలి'

వరంగల్ కలెక్టరేట్, మార్చి 22: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చిన మిర్చి పంటను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేయాలని శుక్రవారం డీఆర్‌వో శ్రీనివాస్‌కు రైతు సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు పండించిన మిర్చికి నాణ్య మైన ధర లేక అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు పండించిన పంటను అమ్మడానికి మార్కెట్‌కు తీసుకురాగా సరైన ధర లేకపోవడంతో ధర వచ్చేంత వరకు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రైతులు కోల్డ్ స్టోరేజీలో భద్రపర్చేందుకు వెళ్లగా కోల్డ్ స్టోరేజీలు నిండిపోయాయనని చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతుల పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు జెండా అంబయ్య, సభ్యులు కూచన కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

మహిళలతో అసభ్య ప్రవర్తన

వారించిన కానిస్టేబుల్‌పై దాడి

మట్టెవాడ, మార్చి 22: ఎంజీఎం ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన మహిళలతో ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించగా, దీనికి అడ్డుకున్న ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్‌పై సదరు యువకుడు దాడిచేసిన ఘటన శుక్రవారం ఎంజీఎం సెంటర్‌లో చోటుచేసుకుంది. మట్టెవాడ సీఐ టి.గోపి కథనం ప్రకారం. ఎంజీఎంలో చికిత్స కోసం ఓ మహిళ వచ్చింది. మధ్యాహ్నం తోటి మహిళలతో ఎంజీఎం బస్టాప్ సమీపంలోకి రాగా రంగంపేటకు చెందిన బైరపాక విజయ్‌కుమార్ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. అక్కడే పెట్రోలింగ్ చేస్తున్న ఎస్‌పీఎఫ్ ఎద్దూరి కమలాకర్ గమనించిన నానిని అడ్డుకొని వారించాడు. దీంతో ఆగ్రహంతో విజయ్‌కుమార్ కానిస్టేబుల్‌పై రాయితో ముఖంపై కొట్టడంతో గాయపడ్డాడు. అనంతరం కానిస్టేబుల్ మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విజయ్‌కుమార్ పై కేసు నమోదు చేశారు. విజయ్‌కుమార్ ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలు



శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను నిర్వహిస్తున్న నాయకులు

కరీమాబాద్, మార్చి 22: రంగశాయిపేట శాలివాహన కుమ్మర డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. సంఘం భవనంలో చక్రవర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. శాలివాహన శకపురుషుడుగా కీర్తింపబడిన చక్రవర్తి పాలన దేశానికే గర్వకారణమని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆవునూరి రవి, ప్రధాన కార్యదర్శి కందికొండ మోహన్, ఉపాధ్యక్షుడు ఆవునూరి కుమార్ కోశాధికారులు కుమార్ పాల్గొన్నారు.

ఉర్సు కుమ్మరి సంఘం భవనంలో...

ఉర్సు కుమ్మరి సంఘం భవనంలో శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం కుల పెద్దలు ఆవునూరి రామ్మూర్తి, ఆవునూరి నాగరాజు, ఆనందం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

సంగెం, మార్చి 22: రైతులకు మేలైన సేవలను రెవెన్యూ అధికారులు అందించాలని వరంగల్ ఆర్డీవో సీదం దత్తు సూచించారు. శుక్రవారం సంగెం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని కంప్యూటర్ విభాగం గదిని సందర్శించి ధ్రువీకరణ పత్రాల జారీతోపాటు రైతులకు ధరణి ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ డివిజనల్ పరిపాలన అధికారి దిలావర్ మొహమ్మద్ అబిద్‌అలీ, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శనివారం 23 మార్చి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

పిచ్చి కుక్క స్వైరవిహారం

• నలుగురికి గాయాలు

నెక్కొండ, మార్చి 22 : నెక్కొండ మండల కేంద్రంలోని అప్పాబజారు వీధిలో శుక్రవారం సాయంత్రం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి నలుగురిని గాయపరిచింది. స్థానికుల కథనం ప్రకారం.. కుక్కల దాడిలో మహిళలు లక్ష్మి, కోటేశ్వ రమ్మ, సుభద్ర వృద్ధురాలు శాంతమ్మ గాయాలయ్యాయి. కాగా, పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న ఇద్దరు విద్యార్థుల వెంట కుక్క పడటంతో విద్యార్థులు పరుగు తీయగా, స్థానికులు కుక్కను కర్రలతో కొట్టారు. దీంతో కుక్కకాటు నుంచి విద్యార్థులు తప్పించుకున్నారు. ముగ్గురు మహిళలకు కాళ్లపై భాగంలో, ఒకరికి తలపై కాటు వేసింది. చికిత్స నిమిత్తం ఇద్దరు ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లారు. గాయాల తీవ్రత తక్కువగా ఉన్న ఇద్దరు నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు. నెక్కొండలో కుక్కల బెడద రోజురోజుకు తీవ్రమవుతుందని, కుక్కలను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మిగిలిన పనులను పూర్తిచేసి...

• ఈ విద్యా సంవత్సరం వైద్య కళాశాలను ప్రారంభించాలి
• అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య



నర్సంపేటలో జిల్లా ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

నర్సంపేట, మార్చి 22 : నర్సంపేట పట్టణ శివారులోని సర్వాపురం సమీపంలో నిర్మిస్తున్న 250 పడకల జిల్లా స్థాయి ఆస్పత్రి భవన నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి ఆస్పత్రి భవన నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటు మిగిలిన భవనం పనులను వెంటనే పూర్తిచేసి ఆస్పత్రిభవనంలో ఈ విద్యా సంవత్సరం మెడికల్ కళాశాలను ప్రారంభించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భవన నిర్మాణాలకు సంబంధించిన నక్షాను కలెక్టర్ పరిశీలించి అధికారులతో మాట్లాడి వైద్యకళాశాలలో మౌలిక సదూపాయల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్య క్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కిషన్, టీఎస్ఎంఐడీసీ అసిస్టెంటు డైరెక్టర్ రాజగోపాల్, తహసీల్దార్ విశ్వప్రసాద్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం



లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

చెన్నారావుపేట, మార్చి 22 : మండలంలోని కోనాపురం గుట్టపైన వెలిసిన శ్రీలక్ష్మీ నర్సింహస్వామి కల్యాణోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కసినోజ్జుల శివకృష్ణాచార్యులు, శంకరశాస్త్రి, గురుబ్రహ్మాచార్యులు వేద మంత్రోచ్చరణ మధ్య స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిశర్మ, మాజీ ఎంపీటీసీ గుండాల మహేందర్, మాజీ సర్పంచ్ వెల్ల సుజాత సారగం, ఎడ్ల నారాయణరెడ్డి, ఉప్పుల రఘుపతి, మండల అనిల్, గంధం నాగరాజు, ఈసంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

కమ్మపల్లిలో పశువైద్య శిబిరం

నర్సంపేట టౌన్, మార్చి 22 : నర్సంపేట మండలం కమ్మపల్లి గ్రామంలోని గోపాలమిత్ర సెంటర్‌లో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని రైతు లకు చెందిన పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల ను వేశారు. పశువైద్యాధికారి డాక్టర్ విద్య మాట్లాడుతూ ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వినియోగించు కోవాలని, శిబిరంలో 50 పశువులకు టీకాలను వేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జె.సత్యనారాయణ, జయరామ్, అన్వేష్, గోపాలమిత్ర పెండ్యాల సురేందర్ పాల్గొన్నారు.

పనులు చేయలే.. పన్నులెందుకు కట్టాలి..

అధికారులను నిలదీసిన గిరిజనులు

వర్ధన్నపేట రూరల్, మార్చి 22 : అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిస్థితి. వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా పనిచేస్తున్నామని మునిసిపల్ అధికారులు ప్రకటనలు విడుదల చేస్తున్నప్పటికీ, సమస్యల మాటేమిటి అంటూ సిబ్బందిని పట్టణ ప్రజలు ఏకరువు పెడుతున్నారు. శుక్రవారం పట్టణంలోని నాల్గవ వార్డులో గల భవాని కుంటతండా, తాళ్లకుంట తండా, బండ తండాలతో పాటు డీసీ తండాల్లో పన్నుల వసూళ్లపై మునిసిపల్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముగ్గురు వార్డు ఆఫీసర్లు, ఐదుగురు బిల్ కలెక్టర్లు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తండాల్లో పన్నుల వసూళ్ల కోసం ఇంటింటికి తిరిగారు. ఎక్కడ చూసినా నిలదీతల పర్వమే ప్రారంభమైంది. తాళ్లకుంట తండాలో ఓ గిరిజన మహిళ తన ఆవేదనను వెల్లగక్కుతూ తాగేందుకు నీరులేక వ్యవసాయ బోర్ల నుంచి గిన్నెల్లో, వాటర్ బాటిళ్లలో రోజువారీగా నీరు తెచ్చుకుంటున్నానని తెలిపింది. తండాల్లో ఎక్కడ చూసిన ఇదే పరిస్థితి ఉందని, మునిసిపల్ సిబ్బంది సంవత్సర కాలంగా ఒక్క రోజైనా వచ్చి సమస్యను పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తంచేసింది. కానీ, పన్నులు చెల్లించాలంటూ ఇండ్ల వద్దకు రావడం ఎంత వరకు న్యాయమో చెప్పాలని డిమాండ్ చేసింది. దీంతో మునిసిపల్ సిబ్బంది ఖంగు తిన్నారు. మానవత్వంతో ఆలోచించి తమ సమస్యలను పరిష్కరించాలని, మునిసిపాలిటీ



తాళ్లకుంట తండాలో సిబ్బందిని నిలదీస్తున్న గిరిజన మహిళ

గా మారడం వలన తమకు ఏం లాభం చేకూరిందో చెప్పాలని గుర్తు చేసింది. వెంటనే సిబ్బంది మునిసిపల్ కమిషనర్ జోనాకు ఫోన్‌లో సమాచారం అందించి వెనుతిరిగారు.

నోరు మెదపని కమిషనర్...

వర్ధన్నపేట మునిసిపాలిటీ కమిషనర్ ఇ.జోనా తీరు పట్టణ ప్రజలను ఆగ్రహనికి గురి చేసేలా చేస్తోంది. ఇప్పటికే ఆయా వార్డుల కౌన్సిలర్లు కమిషనర్ తీరుపై అసహనంగా ఉన్నారు. ఏ సమస్యను లేవనెత్తినా దానిపై శ్రద్ధ చూపకుండా దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నాడని పలువురు కౌన్సిలర్లు చెబుతున్నారు. తండాల్లోనే కాకుండా అన్నీ వార్డుల్లోనూ డ్రైనేజీ సమస్య కనిపిస్తోందని, కానీ కమిషనర్ పట్టించుకోవడం లేదని బాహటంగానే చెబుతున్నారు. 80శాతం పన్నుల రికవరీ చేశామంటూ ప్రకటన చేస్తున్న కమిషనర్ కనీసం అందులోని సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని సిపాయిలు కూడా గుసగుస లాడుకుంటున్నారు.

సమస్యలపై ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి...

మునిసిపాలిటీలో ముసలం అంటూ వర్ధన్నపేట పట్టణ సమస్యలపై ఆంధ్రజ్యోతి ముందే చెప్పింది. పన్నుల వసూళ్ల సరే.. సమస్యల పరిష్కారమేదంటూ ప్రశ్నించిన వర్ధన్నపేట కమిషనర్ ఇ.జోనా పట్టించుకోలేదు. నేడు గిరిజన తండాల్లో తిరగబడి ప్రజలు సైతం గొంతెత్తి ప్రశ్నించిన అధికారుల వద్ద సమాధానం దొరకడం లేదు. ఇప్పటికే వేసవి కాలం ప్రారంభమైంది. ఇప్పుడే తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ఒక నాలుగో వార్డులోనే కాకుండా ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది వార్డులో కూడా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎండలు మరింత ముదిరితే గుక్కెడు నీటి కోసం ప్రజలు తీవ్ర ఇక్కట్లుపడే అవకాశంఉంది. నాల్గవ వార్డులో వెంటనే బోరు వేసి వారి నీటి సమస్యను పరిష్కరించకపోతే తండావాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ప్రతి ఎండాకాలంలో పట్టణ పరిధిలో ఉన్న గుబ్బెడు తండా, నీలగిరి స్వామి, డీసీ తండా ప్రజలు బిందెలతో వ్యవసాయ బావుల వద్దకువెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఇదేతీరును వివరిస్తూ పన్నులు చెల్లించే ముందు మా సమస్యలు ఎందుకు పరిష్కరించంటూ ప్రజలు నిలదీస్తున్నారు. ఇప్పటికైన మునిసిపల్ అధికారులు, ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు పన్నుల స్పెషల్‌డ్రైవ్ కాకుండా, తాగునీటిపై స్పెషల్ డ్రైవ్ పెడితే బాగుంటుందని చెబుతున్నారు.

అన్నారం దర్గా టెండరు ఖరారు



దర్గా నిర్వహణ ఆర్డర్ కాపీని అందుకుంటున్న షబ్బీర్‌అలీ

పర్వతగిరి, మార్చి 22 : మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన అన్నారం షరీఫ్ యాకూబ్‌షావళి దర్గా టెండరు ఖరారైంది. హైదరాబాద్‌లోని వక్ఫ్ బోర్డు కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన సీల్డ్ టెండర్లలో గ్రామానికి చెందిన షబ్బీర్ అలీ రూ.2.13 కోట్లకు టెండరు దాఖలు చేసి దక్కించుకున్నాడు. దీంతో దర్గాలో శుక్రవారం టెండర్ ఆర్డర్ కాపీతో పాటు దర్గా నిర్వహణను షబ్బీర్‌అలీకి వక్ఫ్‌బోర్డు సూపరింటెండెంట్ అమీర్ అహ్మద్ అందించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎమ్డీ.అసదుల్లా, లీగలల ఆఫీసర్ ఫయాజ్, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా, సూపరింటెండెంట్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

• హుండీల లెక్కింపు

దర్గా నిర్వహణ కాంట్రాక్ట్ గడువు ముగియడంతో రెండు వారాల పాటు వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి సంబంధించిన హుండీల లెక్కింపును గురువారం రాత్రి చేపట్టారు. 15 రోజులకు గాను రూ.1.05 లక్షలు వచ్చినట్లు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా తెలిపారు.

రసాభాసగా సాగిన మండల సభ



వాగ్వాదం చేసుకుంటున్న జడ్పీటీసీ, ఏఈ

వర్ధన్నపేట రూరల్, మార్చి 22 : వర్ధన్నపేట మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం రసాభాసగా సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమస్యల పై, పెండింగ్ బిల్లులపై తీవ్ర చర్చలు వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. సంవత్సరాల కాలంగా బిల్లులు రాకపోవడంతో గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, సదరు అధికారులు బిల్లులను ఆన్‌లైన్ చేయడంలో జాప్యం చేశారంటూ సభలో తీవ్ర గందరగోళ వాతావరణం ఏర్పడింది. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా పెండింగ్ బిల్లుల పట్ల ఆయా గ్రామాల ఎంపీటీసీలు ప్రశ్నించారు. దీంతో జడ్పీటీసీ మార్గం భిక్షపతి మైక్ తీసుకుని పంచాయతీరాజ్ ఏఈ రాజేందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఆగస్టులో చేసిన సీసీ రోడ్ల పనుల బిల్లులకు ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదని ఆరోపించారు. అధికారులు వారి చుట్టూ తిప్పించుకుంటున్నారే తప్ప సమస్యను పరిష్కరించలేదని, ఏఈ డీఈ పై, డీఈ ఏఈ చెప్పి కాలం వెల్లదీస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు.

• గ్రామాల్లో తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి : ఎంపీపీ

గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు తాగునీటిపై దృష్టి సారించాలని వర్ధన్నపేట ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి సూచించారు. మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ వస్తున్న ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేకంగా పర్యటించి ప్రజల నీటి అవసరాలను తెలుసుకుని వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా తండాల్లో నీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి, ఎంపీవో ధనలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ప్రతిభ సంస్థ ప్రతినిధి సుదర్శన్‌గౌడ్

నర్సంపేట, మార్చి 22 : నీరే ప్రాణాధారమని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని ప్రతిభ సంస్థ నిర్వాహకుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని విజ్‌డమ్ పాఠశాలలో శుక్రవారం నీటి దినోత్స వం సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టి నీటిని పొదుపు చేయాలన్నారు. కార్యక్ర మంలో పాఠశాల కరస్పాండెంట్ జహంగీర్, డైరెక్టర్ జావేద్, ప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

• రాయపర్తి : వేసవి కాలం సందర్భంగా ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని బాలవికాస ప్రతిని ధి రమ, పాఠశాల హెచ్ఎం ప్రభాకర్ సూచించారు. మండలంలోని సన్నూరులో బాల వికాస ఆధ్వర్యంలో ప్రపం చ నీటి దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. చెరువులు, కుంటలు, బోరు బావుల భూగర్భ జలాలు ఎండిపోకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ :మండలంలోని ఉప్పరపెల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క చుక్క నీటి బొట్టు రేపటికై దాచి పెట్టాలని నినదిస్తూ నీటి విలువను తెలియచేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వేణు మాట్లాడుతూ నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, శ్రీదేవి, రాజు, లింగమూర్తి, విజయ్, రాజు, పీఈటీ వీరస్వామి, జలజ, రమాదేవి, సంధ్యారాణి, అరుణదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయి



క్రికెట్ క్రీడలను ప్రారంభిస్తున్న పెండెం రామానంద్

నర్సంపేట టౌన్, మార్చి 22 : క్రీడల వల్ల యువకుల్లో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని సర్వాపురంలో ఎస్‌పీఎల్ సీజన్-2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడలను శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడల వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాని, ఓడిన వారు మరింత సాధన చేసి విజయం సాధించాలన్నారు. అనంతరం యువకులకు టీషర్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, తుమ్మలపెల్లి సందీప్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో మెళకువలు పాటించాలి



చెన్నారంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వర్ధన్నపేట రూరల్, మార్చి 22 : రైతులు వేరుశనగ పంటలో మేలైన మెళకువలు పాటించాలని కేవీకే మామునూర్ శాస్త్రవేత్త సౌమ్య, ఎన్ఎఫ్ఎస్ఎం ఎమ్మడి జిల్లా కన్సల్టెంట్ సారంగం సూచించారు. శుక్రవారం మండలంలోని చెన్నారం గ్రామంలో జాతీయ ఆహార భద్రత మిషన్ నూనె గింజల పథకం కింద క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంద నర్సయ్య, మంద అశోక్‌ల వ్యవసాయ క్షేత్రంలో వేరు శనగ మినికిట్స్ పంట కోత ప్రయోగం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారులు సూచనలు పాటించి రైతులు మంచి లాభాలు గడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రవి కుమార్, ఏవో రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ కాలేజీలో మెగా జాబ్‌మేళా



ఉద్యోగ నియామక పత్రాలతో విద్యార్థులు

నర్సంపేట టౌన్, మార్చి 22 : పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు కార్పొరేట్ ఉద్యోగ అవకాశా లను కల్పించేందుకు చేస్తున్న కృషిలో భాగమే జాబ్‌మేళా నిర్వహించామన్నారు. జెన్‌పాక్ట్, టెలిఫర్‌పా మెన్స్, క్యూకనెక్ట్, ఎస్ఆర్‌బీఎస్ తదితర 10రకాల సంస్థలచే నిర్వహించిన ఇంటర్వ్యూలో 65 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు వెంకట్, రాఘవకుమార్, ఏవో పరమేశ్వర్, శ్రీధర్ పాల్గొన్నారు.

వైద్యులపై మెడికల్ కమిషన్‌కు ఫిర్యాదు

కరీమాబాద్, మార్చి 22: ప్రభుత్వ వైద్యులు జీతాలుగా తీసుకుంటూ ప్రైవేటు క్లీనిక్‌లు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజా తంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి డి.సాంబమూర్తి, హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యు లు, పబ్లిక్ రిలేషన్ చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర చైర్మన్‌కు పోస్ట్ ద్వారా లేఖ సైతం పంపించారు. వారు మాట్లాడుతూ కాకతీయ మెడికల్ కళాశా ల, వైద్యశాల, ఎంజీఎం ఆస్పత్రు ల్లో పనిచేస్తున్న వైద్యులు లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటున్నా సరైన వైద్య సేవలు అందించడం లేదన్నారు. కనీసం ఓపీ కూడా చూడటం లేదని ఆరోపించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలు అందించాల్సిన సమయంలో ప్రైవేటు క్లినిక్‌లు నిర్వహిస్తూ వైద్యం పేరుతో ప్రజలను దోచుకుంటున్నారన్నారు. జిల్లా వైద్య అధికారులు, సూపరింటిండెంట్‌లు ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్యూటీలో ఉండాలని ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. పలివేల్పుల కు చెందిన పసూనూరి దేవేందర్ మృతికి కారణమైన యూరాలజీ డాక్టర్ రణదీర్ రెడ్డిపై విచారణ జరిపి, అతడి సర్టిఫికెట్లు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

చెన్నారావుపేట, మార్చి 22 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామంలో పదిహేను సంవత్సరాల బాలికను ఆదే గ్రామానికి చెందిన 27 ఏళ్ల యువకుడు కొన్నాళ్లుగా తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడు. బాలిక ప్రేమను నిరాకరించడంతో ఈ నెల 18వ తేదీన యువకుడు బాలిక ఇంటికి వెళ్లి ఇబ్బంది పెట్టాడు. ఈ విషయాన్ని గమనించిన బాలిక తల్లి, స్థానికుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదుచేసి యువకుడిని అరెస్టు చేశారు. యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని రెండు గేదెల మృత్యువాత

• పశువుల కాపరికి తీవ్రగాయాలు

ఖానాపురం, మార్చి 22 : లారీ ఢీకొని రెండు గేదెలు మృతి చెందగా, పశువుల కాపరికి తీవ్రగాయాలైన సంఘట న మండలంలోని బుధరావుపేట శివారులోని జాతీయ రహదరిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన షేరు శ్రీనుకు చెందిన గేదెలను పశువుల కాపరి యాపశెట్టి నాగు లు మేతకు తొలుకెళ్లి శుక్రవారం రాత్రి ఇంటికి తొలుకు వస్తుండగా, బుధరావుపేట శివారు సంగెం కాలువ సమీపంలో జాతీయ రహదారిపై నర్సంపేట నుంచి గూడూరు వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి పశువులను, పశువుల కాపరి నాగులును ఢీకొట్టింది. రెండు గేదెలు సంఘటన స్థలంలోనే మృతి చెందాయి. మరో మూడు గేదెలు తీవ్రంగా గాయపడి లేవలేనిస్థితిలో ఉన్నాయి. అదేవిధంగా పశువుల కాపరి నాగులుకు తీవ్ర గాయాలవడంతో ఆస్పత్రికి తరలిం చారు. ప్రమాదంలో మృతి చెందిన, గాయపడ్డ పశువుల విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.

విద్యార్థులకు వైద్య శిబిరం

దుగ్గొండి, మార్చి 22 : మండలంలోని గిర్నిబావిలోని మహాత్మాజ్యోతిరావు పూలే బాలుర విద్యాలయంలో శుక్రవారం మందపల్లి పల్లె దవాఖానా వైద్యురాలు వనమాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. డాక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రతలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్, హెల్త్ సూపర్‌వైజర్ శారద, హెల్త్ అసిస్టెంట్ సాయికృష్ణ, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కర్యకర్త విజయలక్ష్మి పాల్గొన్నారు.

పోషణ పక్వాడ్ ఉత్సవాలు

చెన్నారావుపేట, మార్చి 22 : మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ పక్వాడ్ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మాజీ సర్పంచ్ తూటీ పావని మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికహారం అందించాలన్నారు. అనంతరం పిల్లలతో తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతపై పిల్లలు జాగ్రత్త వహించాలన్నారు. ఆకుకూరలు. కూరగాయల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు కవిత, స్వప్న, స్వరూప ఆశా కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నల్లబెల్లి, మార్చి 22 : నర్సంపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన బీజేపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బచ్చు వెంకటేశ్వర్‌రావు తల్లి బచ్చు సుకాలమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా మృతదేహాన్ని బీజేపీ నియోజకవర్గ నాయకుడు, చేరికల కమిటీ చైర్మన్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. మృతురా లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్ రెడ్డి, వినయ్‌గౌడ్, అనిల్, అశోక్, యాదగిరి, శ్రీను ఉన్నారు.

పర్వతగిరి తైబజార్ వేలం ఖరారు

పర్వతగిరి, మార్చి 22 : పర్వతగిరి తైబజార్ (వారాంతపు సంత) వేలం ఖరారైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తైబజార్ నిర్వహణకుగాను మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో మాలోత్ శంకర్ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. వేలంలో నర్సంపేటకు చెందిన పాలకుర్తి ప్రభాకర్ రూ.8.11 లక్షలకు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ 20గదులకు నిర్వహించిన వేలంలో ప్రభుత్వ అప్‌సెట్ ధర రానందున ఈ నెల 28వ తేదీన తిరిగి వేలం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బొట్ల మహేంద్ర, మాడుగుల రాజు, ఎంపీవో పాక శ్రీనివాస్, కార్యదర్శి రఘు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తూరు అంగడి వేలం

రాయపర్తి, మార్చి 22 : మండలంలోని కొత్తూరు గ్రామంలో గల అంగడికి ఈ నెల 23న వేలం వేయనున్నట్లు గ్రామ సెక్రటరీ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరావతుసొమ్ము చెల్లించి అంగడి వేలంలో పాల్గొనాలని సూచించారు. గ్రామ పంచాయతీ నియమ నిబంధనలకు అనుగుణంగా వేలం కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు.

మందపల్లి పాఠశాలకు 'అమ్మ ఆదర్శ' కమిటీ ఎంపిక



అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు

దుగ్గొండి, మార్చి 22 : మండలంలోని మందపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. చైర్మన్‌గా గ్రామ స్ఫూర్తి వీవో అధ్యక్షురాలు మేదరి పద్మ, కన్వీనర్‌గా హెచ్ఎం కర్ణకంటి రామూర్తి, సభ్యులుగా రాంపాక జ్యోతి, మాతంగి శైలజ, కసుకుల శైలజ, మొలుగూరి రాణి, తుమ్మలపల్లి మౌనిక, రేణుకుంట్ల కోమల, రేపూరి సుమలత, పెండ్యాల జ్యోతి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యాయురాలు నిర్మల, వీఏవో అంబరకొండ మధురబాయి, తదితరులు పాల్గొన్నారు.